## శ్రమదానంతో రోడ్డు పనులు

ప్రజాశక్తి-అనంతగిరి:మండలంలోని పినకోట పంచాయతీ రాచకిలం గ్రామానికి చెందిన గిరిజనులు చేయి కలిపి రోడ్డు మరమ్మతు పనులు సోమవారం చేపట్టారు. రాచకిలం గ్రామానికి చేరాలంటే పినకోట మెయిన్ రోడ్డు నుండి 10 కిలో మీటర్లు కాలినడకన వెళ్ళవలసి వస్తుంది.ఈ రహదారి మీదుగా పిన్నకోట పంచాయతీ రాచకిలం, గుమ్మంతి, పాలబంధ గ్రామాలు ఆనుకొని ఉన్నాయి. ఈ గ్రామాలు దాటుకొని రాచకిలం గ్రామానికి చేరవలసి ఉంటుంది. రోడ్డు సౌకర్యం కల్పించాలని అనేకసార్లు వినూత్న రీతిలో నిరసన కార్యక్రమాలు చేపట్టినా అధికారులు పట్టించుకోక పోవడంతో గిరిజన ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు కదిలి శ్రమధానంతో రోడ్డు పనులు చేపట్టారు. వార్డ్ మెంబర్ జమరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు

పనులు చేస్తున్న గ్రామస్తులు

# కార్మిక నేత రమేష్‌కు ఘన నివాళి

పాడేరులో రమేష్ చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న చిన్నయ్యపడాల్, నాయకులు

ప్రజాశక్తి -పాడేరు: ఐక్య పోరాటాలతోనే కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్యపడాల్ తెలిపారు. ఉమ్మడి జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి ఎస్.రమేష్ ఐదవ వర్ధంతి పురస్కరించుకొని చింతపల్లిలోని ఆర్‌ఏఆర్ఎస్ కార్మికులతో కలిసి ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ,దేశం, రాష్ట్రంలో కార్మికుల సంక్షేమం కోరే ప్రభుత్వాలు లేవని, సమస్యలు పరిష్కారం కావాలంటే బలమైన కార్మిక పోరాటాల ద్వారానే పరిష్కారం అవుతాయని అన్నారు. లక్షలాది మంది కార్మికులు అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్నారని, ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలు పరిష్కారం కావాలంటే ప్రభుత్వాల మెడలు వంచే పోరాటాలు చేయాలన్నారు. రమేష్ ఏజెన్సీ ప్రాంతంలో కాఫీ కార్మికుల పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొని సమస్యల పరిష్కారం కావడానికి దోహదపడ్డాడని కొనియాడారు. రమేష్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజులమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

**అరకులోయ :**

కనీస వేతనం అమలుకై కార్మిక హక్కులు, చట్టాల రక్షణకై కార్మికవర్గం ఐక్య పోరాటం చేయడమే కామ్రేడ్ రమేష్‌కు ఇచ్చే నిజమైన నివాళని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు పి.బాలదేవ్ అన్నారు. సీఐటీయు అరకులోయ మండల కమిటీ ఆధ్వర్యంలో గిరిజన మ్యూజియంలో మ్యూజియం వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు డి.రాజు అధ్యక్షతన సీఐటీయు ఉమ్మడి విశాఖపట్నం జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్.రమేష్ 5వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలదేవ్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో అనేక ఉద్యమాలకు రమేష్ ప్రాతినిధ్యం వహించారన్నారు. ఏపీ టూరిజం, విఆర్ఏ, గ్రామ పంచాయతీ, గిరిజన మ్యూజియం, పద్మాపురం, కొత్తవలస గార్డెన్, కాఫీ కార్మికుల పోరాటంలో అగ్ర భాగాన నిలిచారన్నారు. బాక్సైట్ పోరాటంలో మార్గదర్శకంగా నిలిచారన్నారు. రమేష్ ఉద్యమ స్ఫూర్తితో భవిష్యత్‌లో కనీస వేతనం అమలుకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విఆర్ఏ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అప్పారావు, మ్యూజియం నాయకులు బురుంధ, లక్ష్మి, రంభ, రామారావు, రాంబాబు, ప్రశాంత్, ఆటో సంఘం నాయకులు హరి, షోప్ యూనిట్ నాయకులు దాసుబాబు, కృష్ణ, లలిత, పద్మ, కమందన్న తదితరులు పాల్గొన్నారు.

అరకులోయలో నివాళి అర్పిస్తున్న బాలదేవ్, నాయకులు

మాట్లాడుతున్న గిరిజన సంఘ: రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు

## 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

### గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు

ప్రజాశక్తి-మారేడుమిల్లి

1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పాత ఎంపీడీవో కార్యాలయం వద్ద ఈతపల్లి సత్యనారాయణ రెడ్డి అధ్యక్షతన గిరిజన సంఘం మండల మహాసభ జరిగింది. ఇందులో పాల్గొన్న రామారావు మాట్లాడుతూ మారేడుమిల్లి మండలంలో గిరిజనుల హక్కులు కాపాడాలని, గిరిజనులకు భరోసాగా ప్రభుత్వాధికారులు నిలబడాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాబోయే రోజుల్లో గిరిజన సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. లోతట్టు గ్రామాలకు ఎటువంటి రహదారి సౌకర్యం లేక వైద్యానికి గిరిజనులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన గ్రామాల రహదారులపై దృష్టి పెట్టాలని, పూర్తిస్థాయిలో విద్యా, వైద్యం అందించాలని కోరారు. పీసా చట్టం ద్వారా గ్రామసభలు నిర్వహించిన 5వ షెడ్యూల్, పీసా చట్టంలో ఇచ్చిన హక్కులను అమలు చేయాలన్నారు.

సిఐటియు రంపచోడవరం జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ మాట్లాడుతూ గిరిజన చట్టాల్ని అమలు చేయడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. తాగునీరు, రహదారులు, ఉపాధి హామీ పనిదినాలు, కూలి రేట్లుపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. నిండు గర్భిణి సుఖ ప్రసావం కావాలన్నా, తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉండాలన్నా గిరిజనులకు మెరుగైన వైద్యం అందాలన్నా రహదారులు ఏర్పాటు చేయాలని కోరారు. రాబోవు రోజుల్లో కార్మిక సంఘం, గిరిజన సంఘం ఐక్యంగా పోరాడాలని పిలుపు నిచ్చారు.

**మండల కమిటీ ఎన్నిక**

ఈ మహాసభలో గిరిజన సంఘం మండల కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్ష కార్యదర్శులుగా ఆవుల ధర్మారెడ్డి, ఈతపల్లి సిరిమల్లి రెడ్డి, ఏడుగురు కార్యదర్శివర్గ సభ్యులుగా, మరో ఆరుగురు కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఏడు గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు రాలేని..

# గర్భిణులు, బాలింతల ఇంటికే పౌష్టికాహారం

### జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు:అంగన్వాడీ కేంద్రాలకు రాలేక పోయిన గర్భిణీలు, బాలింతలకు వారి ఇంటికే పౌష్టికాహారం పంపించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాడేరు నియోజక వర్గం పరిధిలోని ఐసిడిఎస్ అధికారులు, మహిళా పోలీస్‌లతో సోమవారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, అంగన్వాడి సూపర్వైజర్లు, ఆయాలు, హేల్పర్లకు సచివాలయాల మహిళా పోలీస్‌లు సహకరించాలని సూచించారు. బరువు, ఎత్తు తక్కువున్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ కనపర చాలన్నారు. ఆరు నెలల నుండి 36 నెలల పిల్లలకు తప్పనిసరిగా పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రక్త హీనతతో బాధ పడుతున్న వారిని, హై రిస్క్ గర్భిణీలను గుర్తించి వారికి సరైన అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో అధికంగా మహిళా పోలీసులు ఉన్నందున గిరిజన గర్భిణీల, బాలింతల భాద్యతను తీసుకోవాలని సూచించారు. మాతా, శిశు మరణాల నివారణలో మహిళా పోలీస్‌ల పాత్ర కీలకమన్నారు. సచివాలయాలలో వాలంటీర్ల సహాయంతో ఇంటికి రేషన్ పంపించాలన్నారు. మహిళా పోలీసులు గర్భిణీలు, బాలింతలకు అందిస్తున్న సేవలపై రికార్డుల తనిఖీ చేస్తానని తెలిపారు.ఎండియు వాహనాల ద్వారా అంగన్వాడి కేంద్రాలకు రేషన్ సరఫరా చేయాలని, ఈ మేరకు తహసిల్దార్లకు ఆదేశాలు జారీ చేస్తామని కలెక్టర్ స్పష్టం చేసారు. అంగన్వాడీ కేంద్రాలకు రాని పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులు, సర్పంచ్‌లతో మాటాడి వారిని రప్పించాలన్నారు.రాలేని పిల్లలకు పాలు, గుడ్లు పంపించాలని ఆదేశించారు. సచివాలయ సిబ్బందికి క్రమ బద్ధీకరణ జరిగిందని, ఇప్పటికీ ఏమీ తెలీదని తప్పించుకోకుండా భాద్యతతో మెలగాలని హెచ్చరించారు.

ఐసిడిఎస్ పథక సంచాలకులు సూర్య లక్ష్మి మాట్లాడుతూ, సమస్యలుంటే స్థానిక సిడిపిఓ దృష్టికి తీసుకు వచ్చి పరిశ్కరించుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ సిడిపిఓలు, సూపెర్వైజర్లు, ఆయా మండలాల మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

## జలజీవన్ మిషన్ పనులు పూర్తి చేయండి

ప్రజాశక్తి-పాడేరు: జల జీవన్ మిషన్ కింద చేపట్టిన తాగు నీటి పధకాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. పనులలో నాణ్యత లేకుంటే సహించేది లేదని హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాడేరు డివిజన్ జల జీవన్ మిషన్, ఆర్‌డబ్ల్యుఎస్ పనుల ప్రగతిని సమీక్షించిన కలెక్టర్ మాట్లాడుతూ, ఐదు లక్షల కన్నా తక్కువ, ఐదు లక్షల కన్నా ఎక్కువ ఖర్చుతో చేపట్టిన పనుల ప్రగతిపై ఆరా తీసారు. అదేవిధంగా ఒక్కో కంట్రాక్టర్ ఎన్ని పనులు చేస్తున్నది ఆరా తీసారు. ఈ సందర్భంగా ఒక్కో కంట్రాక్టర్ నాలుగు పనులు కన్నా ఎక్కువ అప్పగించవద్దని, క్లాస్ -1 కంట్రాక్టర్ ఐతే గరిష్టంగా పది పనులు మించి అప్పగించావద్దని ఆదేశించారు. ఎక్కువ పనులు తీసుకున్న కాంట్రాక్టర్లు సబ్ కాంట్రాక్టుకు ఇవ్వటంతో నాణ్యతా ప్రమాణాలు తగ్గుతాయని, అంతే కాకుండా పనులు సకాలంలో పూర్తి కావని తెలిపారు. సుమారు తొమ్మిది కోట్ల రూపాయల వరకు బిల్స్ పెండింగ్ ఉన్నందున బిల్లులను వెంటనే అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ఒక వేళ పని పూర్తి కాకపోతే పని అయినంత మేర పార్ట్ బిల్లును కూడా అప్లోడ్ చేయాలన్నారు. బిల్లులు అప్లోడ్ చేయకపోతే కంట్రాక్టర్లకు చెల్లింపు జరగదని, సంబంధిత సహాయ ఇంజినీర్లు డిఇఇ కి పంపాలని, ఇఇ పరిశీలించి వెంటనే అప్లోడ్ చేయాలని ఆదేశించారు. సకాలంలో ప్రారంభించని పనులపై ఆరా తీసిన కలెక్టర్ ఆయా పనులను రద్దు చేసి తిరిగి టెండర్ పిలవాలని ఆదేశించారు. పనులకు సంబంధించి గ్రామ సర్పంచ్‌లతో ఎప్పటికప్పుడు సమావేశం కావాలని ఆదేశించారు. అదేవిధంగా గడప గడపకు మన ప్రభుత్వం కింద మంజూరైన పనులను కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్ డబ్ల్యు ఎస్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి. లీలా కృష్ణ, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లు చంద్రకిరణ్, ఎం.జయరాం, జిఆర్ హెచ్ రాజు, గోపాలకృష్ణ, ప్రకాష్ పాల్గొన్నారు.

బాలికపై దాడి చేస్తున్న పిచ్చి కుక్క

## పిచ్చి కుక్క స్వైర విహారం

### చిన్నారిని ఈడ్చుకెళ్తుండగా కాపాడిన యువకులు

### 10 మందికి గాయాలు

ప్రజాశక్తి -సీలేరు

జికె.వీధి మండలం సీలేరు, దుప్పిలివాడ పంచాయతీల్లో సోమవారం పిచ్చికుక్క స్వైర్య విహారం చేసింది. పిచ్చికుక్క దాడిలో పదిమంది గాయపడ్డారు. ఈ సంఘటనతో ప్రజలు తీవ్ర భయాందోళన చెందారు. సీలేరు పంచాయతీ పరిధి దుర్గా వీధిలో భగత్‌రాం అనే యువకునితో పాటు మరికొంత మంది యువకులను, మహిళలను పిచ్చి కుక్క గాయపరిచింది. అనంతరం అల్లూరు వీధిలో డిఎవి విద్యార్థి ఎనిమిదేళ్ల పి.ఆశ్రిత వీధిలో తోటి చిన్నారులతో ఆడుకునే సమయంలో పిచ్చికుక్క అకస్మాత్తుగా దాడి చేసింది. ఆశ్రితను కరిసి ఈడ్చుకుంటూ పోతుండగా సమీపంలో ఉన్న యువకులు చూసి వెంబడించి పిచ్చికుక్క బారి నుంచి ఆశ్రితను కాపాడారు. అప్పటికే ఆశ్రిత చేతికి బలమైన గాయాలయ్యాయి. దానిని కొట్టేందుకు కొందరు యువకులు ప్రయత్నించినప్పటికీ తప్పించుకుని పారిపోయింది. అనంతరం సీలేరుకు 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న దుప్పిలివాడ పంచాయతీ వలస గెడ్డ, వలస గెడ్డ కాలనీ, వలస గెడ్డ కొత్తూరు గ్రామాలకు వెళ్లి పరదాని డోంబురు, కిలో జగన్నాథం అనే యువకులను, ఒక మహిళను తీవ్రంగా గాయపరిచింది. దీంతో మూడు గ్రామాలకు చెందిన యువకులు పిచ్చి కుక్కని వెంబడించి హతమార్చడంతో మూడు గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పిచ్చికుక్క బారిన పాడిన బాధితులు స్థానిక పిహెచ్‌సికి చేరుకొని వైద్య సేవలు పొందారు.

దాడిలో గాయపడిన ఆశ్రిత

## భూ రీ సర్వేను పరిశీలించిన జెసి

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మారేడుమిల్లి మండలంలోని జిఎం వలస పంచాయితీ పరిధి వాలమూరు గ్రామంలో సోమవారం చేపట్టిన భూ రీ సర్వేను జిల్లా జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతికి తావు లేకుండా సర్వేలు చేయాలన్నారు. రైతులకు వారి వారి సరిహద్దులు గుర్తించి చూపించాలన్నారు. భూ రీ సర్వే వల్ల రైతులకు చేగూరే లబ్ధిని తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మారేడుమిల్లి ఎమ్మార్వో శ్రీనివాసరావు, వీఆర్వో మురళీకృష్ణ, సర్వేయర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వేను పరిశీలిస్తున్న జెసి శివ శ్రీనివాస్

పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

## మజ్జివలసలో వైద్యశిబిరం

ప్రజాశక్తి-హుకుంపేట:మూఢ నమ్మకాలకు దూరం గా ఉండి ప్రభుత్వం అందిస్తున్న వైద్యం పట్ల మక్కువ చూపించాలని వైద్యాధికారి ప్రశాంత్ బాబు సూచించారు. మండలంలోని బూర్జ పంచాయతీ మజ్జివలస గ్రామంలో ఉచితం మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి విద్యార్థులకు, గర్భిణులకు పరీక్షలు చేశారు. క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ, వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రెండు వారాలకు మించి దగ్గు, ఆకలి చేయకపోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే దగ్గర్లో ఉన్న పీహెచ్‌సికి వెళ్లి కఫం పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ సన్యాసిరావు, హెచ్‌వి సంతమణి, ఎంపీహెచ్‌హెచ్ మోహన్‌రావు, టిబీ సూపర్వైజర్ సదానందం పాల్గొన్నారు.

## ఫుట్‌పాత్‌పై దుకాణాల తొలగింపు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని రోడ్ విస్తరణలో భాగంగా రోడ్‌కి ఇరువైపు లా ఫుట్‌పాత్‌పై గిరిజనేతరులు ఏర్పాటు చేసిన దుకాణాలను పంచాయతీ, రెవిన్యూ అధికారులు సోమవారం తొలగించారు. పంచాయతీ అధికారులు మాట్లా డుతూ, గతంలో నోటీసులు ఇచ్చామని, గడువు ముగియడంతో జెసిబిలో తొలగించడం జరిగిందన్నారు. ఫుట్ పాత్ ఆక్రమణ చేసి దుకాణాలు ఏర్పాటు చేస్తే కఠినంగా తీసుకుంటామని చెప్పారు.

తొలగించిన దుకాణం

టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

## పశువులకు టీకాలు

ప్రజాశక్తి-అనంతగిరి: పశువులకు లంపీ వ్యాధి వ్యాపించకుండా టీకాలు వేస్తున్నామని పశు వైద్యదికారి గణేశ్వరరావు తెలిపారు. పినకోట పంచాయతీ వాజంగి, రెడ్డిపాలెం, రాచకీలం, గుమ్మంతి గ్రామాలలో ప్రత్యేక పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. వ్యాధిబారిన పడిన పశువులకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ వెటర్నరీ ఆసిస్టెంట్, సచివాలయ పశుసంవర్ధక సాహాయకులు పాల్గొన్నారు.

# తాగునీరు, వీధిలైట్ల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి- చింతూరు.

మండలంలోని కల్లేరు సచివాలయం పరిధి కల్లేరు, కుయుగూరు, మదుగురు, సూరన్నగొంది గ్రామాల్లో తాగునీరు, అంతర్గత రోడ్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన కల్లేరు గ్రామ సచివాలయ వద్ద ధర్నా నిర్వహించారు. మంచినీరు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని, ఉపాధి హామీ పెండింగ్ బిల్లులు చెల్లించాలని, అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, పింఛన్లు, ఉపాధి జాబ్ కార్డులను మంజూరు చేయాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. రచ్చబండ నుండి సచివాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. ధర్నా అనంతరం వినతి పత్రాన్ని గ్రామపంచాయతీ కార్యదర్శి సురేష్ అందజేశారు. సచివాలయం పరిధిలో ఉన్న సమస్యలన్నింటినీ ఒక నెల రోజుల్లో పరిష్కరిస్తామని, వీధిలైట్లు తక్షణమే వేస్తామని పంచాయతీ కార్యదర్శి సురేష్ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థలకు నిధులు కేటాయించడంలో శ్రద్ధ చూపకపోవడంతో గ్రామాల్లో సమస్యలు పేరుకుపోతున్నాయని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన సబ్ ప్లాన్ నిధులను గిరిజన అభివృద్ధికి మాత్రమే కేటాయించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎర్రం శెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం కొరకు సచివాలయాలు ఏర్పాటు చేసినట్లు గొప్పగా ప్రకటించి, నిధులు లేకుండా చేయడంతో ఎలాంటి సమస్యా పరిష్కారం కావడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కుంజా సీతారామయ్య, ముర్రం రంగమ్మ, కారం సుబ్బారావు, సోడే రాఘవయ్య, సోడే రెడ్డి, కమలమ్మ, రాములమ్మ, చిన్నమ్మి, జోగమ్మ, నారాయణ, కారం వినోద్, సుబ్బమ్మ, పూనం బుచ్చయ్య, పాండు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం ఎటుట బైఠాయించిన గిరిజనులు, సిపిఎం నాయకులు

# ఐక్య పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

### సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఐక్యపోరాటాలుతోనే భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కారమవుతాయని సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వెంకట్ అన్నారు. సోమవారం స్థానిక తాపీ మేస్త్రిల సంఘం భవనంలో ఎలక్ట్రికల్ యూనియన్ మహాసభ ఆ సంఘం నాయకులు కె.రాంబాబు అధ్యక్షతన జరిగింది. తొలిత భవన నిర్మాణ కార్మికులు రాజవొమ్మంగిలో ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం జరిగిన మహాసభలో వెంకట్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులు, చట్టాలను తుంగలో తొక్కుతున్నాయని విమర్శించారు. కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి కార్మికుల హక్కులను హరిస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులు రూ.800 కోట్లు దారి మళ్లించడంతో వారికి రావలసిన క్లైములు, ఇతర బెనిఫిట్స్ రాకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా కష్టకాలంలో భవన నిర్మాణ కార్మికులకు కరువు భత్యం ఇస్తామని చెప్పి నేటికీ ఇవ్వలేదన్నారు. సంక్షేమ బోర్డ్ నిధిని వారికే కేటాయించాలని డిమాండ్ చేశారు.

**నూతన కమిటీ ఎన్నిక**

ఈ మహాసభలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. మండల అధ్యక్ష కార్యదర్శులుగా కె.రాంబాబు, సిహెచ్.రాంబాబు, ఉపాధ్యక్షులుగా డి.రాము, పి.కిరణ్, సహాయ కార్యదర్శులుగా కె.రాంబాబు, వి.భద్రం, కోశాధికారిగా నాగేంద్ర, మరో 8 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు పి.రామరాజు, మండల నాయకులు కె.వెంకటలక్ష్మి, పి శ్రీను, పి కిరణ్, ఎన్ అచ్చారావు, ఎన్ రామకృష్ణ, ఏ యోహాన్, చిట్టిబాబు, దుర్గబాబు, చిన్ని కుమారి, లక్ష్మిశ్రీ చంద్రావతి, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

రహదారి ఏర్పాటుకు పరిశీలిస్తున్న జెఇ, సర్పంచ్

## రోడ్డు ఏర్పాటుకు చర్యలు

**ప్రజాశక్తి-అనంతగిరి:**మండలంలోని టోకూరు పంచాయతీ పరిధి చిట్టంపాడు జలపాతానికి రోడ్డు మార్గం ఏర్పాటుకు టోకూరు సిపిఎం సర్పంచ్ కిల్లో మొస్య మండల పంచాయతీరాజ్ జేఈ సమరెడ్డి మాణిక్యంలు సోమవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్, జెఇ. లు మాట్లాడుతూ చిట్టంపాడు జలపాతాన్ని తిలకించేందుకు వచ్చే పర్యటకులకు అనుకూలంగా రోడ్డు మార్గాన్ని పంచాయతీ సాధారణ నిధులతో నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. రాయిపలస నుండి చిట్టంపాడు మీదుగా జలపాతం వరకు తాత్కాలిక మట్టి రోడ్డు పనులు వారం రోజుల్లో మొదలు పెట్టేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గెమ్మెల నరసన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్‌ను తరలిస్తున్న గ్రామస్తులు

## దుర్గంలో తాగునీటి పైపులైన్ పనులు

**ప్రజాశక్తి -అనంతగిరి:**మండలంలోని పినకోట పంచాయతీ పరిధి దుర్గం గ్రామంలో తాగునీటి పైపులైన్ పనులను చురుగ్గా చేపట్టారు. తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం జేజేఎం నిధుల కింద మంజూరు చేసిన పైపులైన్, ట్యాంక్ పనులను చేశారు. పినకోట నుండి దుర్గం వరకు కనీస రోడ్డు సౌకర్యం లేక పోవడంతో 5000 లీటర్ల ట్యాంక్‌ని కర్రలు కట్టి భుజంపై మూసుకొని సుమారు కిలోమీటర్ మేర గ్రామానికి చేర్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు లైకోన్, సుందరరావు, బాబూరావు పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాలలో సమస్యలను పరిష్కరించాలి

**ప్రజాశక్తి-పాడేరు:** మండల పరిధిలో ఉన్న మలక పొలం గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను అధికారులు పర్యవేక్షించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కే.ప్రభుదాస్ విజ్ఞప్తి చేశారు. సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మలకపొలం పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ ప్రధాన ఉపాధ్యాయులు వారానికి పాఠశాలలో నాలుగు రోజులు మాత్రమే ఉంటారని, మిగతా రోజులు ఉండరని విద్యార్థులు ఎస్ఎఫ్ఐ నాయకులకు చెప్పారు. రోజు కూరగాయలు పెడతున్నారని, పూర్తి స్థాయిలో మెనూ అమలు కావడలేదని నాయకులు తెలిపారు.పాఠశాలలో 157మంది విద్యార్థులు ఉండగా 76మంది ఇంటికి వెళ్లారని ఆయన పేర్కొన్నారు. పాఠశాలలో పర్యవేక్షణ, అధికారుల సందర్శనలు లేక పోవడంతో విద్యార్థుల హాజరు తగ్గుతోందని, దీనిపై దృష్టి సారించాలన్నారు.

# వివాదాలకు తావులేకుండా భూముల రీ సర్వే

సమావేశంలో మాట్లాడుతున్న పిఒ గోపాలకృష్ణ

### ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ

**ప్రజాశక్తి-పాడేరుటౌన్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన వైఎస్ఆర్ శాశ్వత భూ హక్కు భూరక్ష సర్వే ప్రక్రియ సంబంధిత యజమాని సమక్షంలో వివాదాలకు తావు లేకుండా, ప్రణాళిక బద్ధంగా పూర్తి చేయాలని ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ ఆదేశించారు. సోమవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో అనంతగిరి, కొయ్యూరు, అరకు వ్యాలీ మండలాల మండల, సచివాలయం సర్వేయర్లు, రెవెన్యూ, సర్వే అధికారులతో భూముల రీ సర్వేపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ఆదేశాల మేరకు 6నెలల్లో రీ సర్వేపూర్తి చేయాలన్నారు. ఇద్దరు సర్వే సాంకేతిక నిపుణులు, ఇద్దరు వీఆర్‌ఓలు, ఇద్దరు సర్వేయర్లు బృందంగా ఏర్పడి రెండు సర్వే రోవర్లతో సర్వే చేయాలన్నారు. పట్టా భూములు, ప్రభుత్వ భూములు, ఆర్ఓఎఫ్ఆర్ భూములపై సర్వేయర్లు అవగాహన ఉండాలన్నారు. సర్వే చేస్తున్న గ్రామంలో ముందుగా వాలంటీర్లకు సమాచారం అందించి రైతులను చైతన్యవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో సర్వే సహాయ తహశీల్దారులు, సంచాలకులు వై.మోహనరావు, మండల, సచివాలయం సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

**టూరిజం పనులు వేగం చేయండి**

పర్యాటక ప్రాంతాలలో చేపట్టనున్న అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలక్రిష్ణ ఆదేశించారు. సోమవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో ఇంజనీరింగ్ అధికారులు, ఎంపిడిఒలు, తహశీల్దారులు, టూరిజం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వంజంగి, కొత్తపల్లి జలపాతం, చెరువుల వేనం, కొత్తవలస, తాజంగి పర్యాటక ప్రాంతాలలో జరుగుతున్న పనుల త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. చెరువుల వేనం బ్లాస్టింగ్ పనులు పూర్తి చేసి రహదారి పనులు, మరుగుదొడ్ల నిర్మాణాలు, విద్యుత్ దీపాల ఏర్పాటు పనులు వేగంగా జరగాలన్నారు. వంజంగి, కొత్తపల్లి జలపాతం పార్కింగ్ ప్రదేశాలను గుర్తించి తగిన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. మ్యూజియం షాపింగ్ కాంప్లెక్స్ అద్దెలను కమిటీ అధ్యయనం చేసి నిర్ణయించడం జరిగిందన్నారు. షాపులు నిర్వహిస్తున్న యజమానుల నుండి అద్దెల వసూలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. షాపులు పొందిన యజమానులు వ్యాపారాలు ప్రారంభించకపోతే నోటీసులు ఇచ్చి కేటాయింపులు రద్దు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎపిఒలు వివిఎస్ ప్రభాకరరావు, ఎం.వెంకటేశ్వర రావు, డిడిట్రైబ్లు ఇఇ డివిఆర్ఎం రాజు, డిఇఇలు, మ్యూజియం మేనేజర్ మురళి, డిఇలు, ఎఇలు తదితరులు పాల్గొన్నారు.

**అర్హులందరికి పథకాలు**

అర్హత కలిగిన ప్రతీ లబ్దిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలక్రిష్ణ ఆదేశించారు. సోమవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో ప్రాజెక్టు రివ్యూ కమిటీ సమావేశం నిర్వహించారు. అమ్మ ఒడి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, రైతు భరోసా, అటవీ హక్కు చట్టం అమలు, ప్రధాన మంత్రి మాతృ వందన యోజన పథకాలు అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఆధార్ కార్డులు, రైస్ కార్డులతో ఉన్న లోపాలను సవరించి పథకాలు అందే విధంగా అధికారులు చొరవ చూపాలన్నారు. ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు కలిగిన ప్రతీ ఒక్కరికి 100 రోజులు, అటవీ హక్కులున్న లబ్దిదారులకు 150 రోజులు పని కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒలు వివిఎస్.ప్రభాకరరావు, ఎం.వేంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బిఎస్ నంద్, డిఇఇ పి.రమేష్, తహశీల్దారులు తదితరులు పాల్గొన్నారు.

# పాల డబ్బాలు పంపిణీ

పాల డబ్బాల పంపిణీలో కిల్లో సురేంద్ర తదితరులు

**ప్రజాశక్తి-డుంబ్రిగూడ**

మండలంలోని అరకు సంత బయలులో యూనిటీ ఫర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తల్లి కోల్పోయిన చంటి పిల్లలకు ఉచితంగా పాలు డబ్బాలను సోమవారం పంపిణి చేశారు. అనంతగిరి మండలం గుమ్మ పంచాయతీ కరివేసు గ్రామానికి చెందిన పాడి సోములమ్మ అనే బాలింత గత నెల 21న అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో చంటి పాపకు పాల డబ్బలను అందించేందుకు గాను స్థానిక యూనిట్ పర్ చారిటీ ట్రస్టు ముందుకు వచ్చి పాప పెరిగేంతవరకు పాల డబ్బాలను పంపిణీ చేస్తామనీ హామీ ఇచ్చారు. సోమవారం గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర చేతులమీదుగా పాల డబ్బాలను అందజేశారు. అనంతరం సురేంద్ర మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో తల్లులు కోల్పోయిన చంటి బిడ్డలకు ఇటువంటి సేవలు అందిస్తున్న యూనిటీ ఫర్ చారిటబుల్ ట్రస్టుకు సేవలను కొనియాడారు. భవిష్యత్తులో మరింత సేవలను అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు నీలి నారాయణరావు, నీలి మేరీ జోష్, గిరిజన సంఘం నాయకులు పి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి సాంస్కృతిక విభాగం అధ్యక్షునిగా నాగబ్బాయి

**ప్రజాశక్తి -జి.మాడుగుల:** తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గ సాంస్కతిక విభాగ అధ్యక్షులుగా సీనియర్ నాయకులు సమిరెడ్డి నాగబ్బాయిని నూతనంగా నియమించారు. ఈ సందర్బంగా సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, సాంస్కతిక విభాగ అధ్యక్షులుగా నియమించడం పట్ల హర్షం తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షులు కింజరపు అచ్చియ్యానాయుడు , పాడేరు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇంచార్జి గిడ్డి ఈశ్వరి లకు ఆయన ధన్యవాదములు తెలియజేశారు.

# నేరాలు ఘోరాలు

## ఎఎన్ఎం హఠాన్మరణం

మృతి చెందిన ఎఎన్ఎం వరహాలమ్మ

**ప్రజాశక్తి పాడేరు :** మండలంలోని మినుములూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కిండంగి ఆరోగ్య ఉప కేంద్రంలో పని చేస్తున్న ఎఎన్ఎం వనుము వరహాలమ్మ సోమవారం ఉదయం విధి నిర్వహణలోనే హఠాన్మరణానికి గురైంది. వరహాలమ్మ ఉదయాన్నే విధి నిర్వహణలో ఉంటూ అందరిని నవ్వుతూ పలకరిస్తూ తోటి ఉద్యోగులతో కలిసి పని చేస్తూనే ఒకేసారి కుప్ప కూలి పోయింది. దీంతో, సహోద్యోగులు పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్య సేవలు అందక మునిపే ఆమె ప్రాణాలు విడిచింది. వరహాలమ్మ మృతి పట్ల గిరిజన వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శెట్టి నాగరాజ్ తో పాటు పలువురు సంఘ సభ్యులు ఆరోగ్య శాఖ ఉద్యోగులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యేకు స్వీటు ఇస్తున్న యూనియన్ నేతలు

## ఎమ్మెల్యేకు అభినందనలు

**ప్రజాశక్తి-అరకులోయ రూరల్:** అరకులోయ వాయు పుత్ర మోటార్ యూనియన్ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన పాంగి నాగార్జున ఆ సంఘం సభ్యులతో కలిసి ఎమ్మెల్యే ఫాల్గుణను మర్యాద పూర్వకంగా సోమవారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు పాంగి నాగార్జునకు కార్యవర్గాన్ని అభినందించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు నాగార్జున మాట్లాడుతూ,పార్కింగ్ చేసుకొనుటకు స్థలం కేటాయించినందుకు మోటార్ యూనియన్ తరుపున కృతజ్ఞతలు తెలిపారు. యూనియన్ ఆఫీస్‌కు స్థలం కేటాయించాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి భవన నిర్మాణం కొరకు ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసు బాబు, నాయకులు షేక్ యాసిన్, జన్నీ రాము, బషీర్, షరీఫ్, సాంబ పాల్గొన్నారు.

## వెదురు సామగ్రికి గిరాకీ

**ప్రజాశక్తి-పెదబయలురూరల్:**మండల కేంద్రంలో సోమవారం జరిగిన వారపు సంతలో వెదురు కర్రతో చేసిన వస్తువులకు గిరాకీ లభించింది.చిన్న బుట్ట మొదలుకుని పెద్ద గంప, చాట, చాప తదితర వస్తవులను వారపు సంతలో అమ్మకానికి తీసుకొని వచ్చారు. వివిధ రకాల చిన్న సైజ్ బుట్ట రూ.100, మీడియం సైజ్ రెండు వందలు, గంపకు రూ.400 వరకు ధరలు లభించింది. దీంతో చేతి వృత్తి దారులు ఆనందం వ్యక్తం చేశారు.

సంతలో వెదురు బుట్టలు

మెయిన్ డ్యాం పై నుంచి ప్రకృతి అందాలను తిలకిస్తున్న పర్యాటకులు

## కమ్మేస్తున్న పొగ మంచు

### - ప్రకృతి అందాలను తిలకించేందుకు క్యూకడుతున్న పర్యాటకులు

**ప్రజాశక్తి - సీలేరు :** ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతంలో పొగ మంచు కమ్మేస్తుంది. దట్టంగా కురుస్తున్న మంచుకు సీలేరు పరిసర ప్రాంతాలు ప్రకృతి రమణీయంగా మారడంతో ఆ అందాలు తిలకించేందుకు సోమవారం పర్యాటకులు క్యూ కట్టారు. జీకే వీధి మండలం సీలేరు, దారకొండ, దుప్పిలివాడ పరిసర ప్రాంతాల్లో మంచు విస్తీరంగా కురుస్తుండడంతో మంచు లోగిలిలో ప్రకృతి రమణీయమైన దశ్యాలు పర్యాటకులకు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాల నుంచి పర్యాటకులు మంచు దృశ్యాలు, ప్రకృతి అందాలు తిలకించి మంత్రముగ్ధులయ్యారు. సీలేరు రిజర్వాయర్లో సోమవారం ఉదయం దట్టమైన మంచు అలముకొని నదీ జలాలు కనిపించకుండా ఉన్న దృశ్యాలను చూసి పర్యాటకులు మైమర్చిపోయారు. మంచు అందాల్లో పర్యాటకులు ఫోటోలు దిగి వారి కెమెరాలు బంధించారు. ఆంధ్ర ఒడిశా సరిహద్దు గుంటవాడకి వెళ్లే మార్గం 6 గంటలకు సూర్యోదయం వేళలో పూర్తిగా మంచు మయంగా ఉండడంతో రహదారులు కనిపించకపోగా, పచ్చని చెట్లు ఆకులపై నుంచి మంచు బిందువులు రాలుతుంటే అటువంటి సుందర దృశ్యాలు పర్యాటకులు చూసి ఎంతో ఆహ్లాదాన్ని పొందారు.

అయ్యన్నపాత్రుడును పరామర్శిస్తున్న దొన్నుదొర

## అయ్యన్నకు దొన్నుదొర పరామర్శ

**ప్రజాశక్తి-హుకుంపేట:**ప్రశ్నించే గొంతుకకి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించడం సరికాదని టిడిపి ఎస్టి సెల్ రాష్ట్ర అధ్యక్షులు సివేరి దొన్నుదొర అన్నారు. సోమవారం నర్సీపట్నంలో మాజీ మంత్రి, టిడిపి పోలిటి బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడుని ఆయన నివాస గృహంలో పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న అరాచక సకపాలనను ప్రశ్నించే వ్యక్తుల గొంతు నొక్కే ప్రయత్నం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం చేస్తుందని విమర్శించారు.ప్రతిపక్షాలపై కక్షపూరితంగా అక్రమ అరెస్టులు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అక్రమ అరెస్టులకు భయ పడేది లేదన్నారు.మారుమూల గ్రామాల్లో రహదారి, తాగునీరు, రవాణా సౌకర్యాలు లేక ప్రజలు అల్లాడిపోతుంటే వారి సమస్యల కోసం మాట్లాడటం తప్పా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు సంతోష్ కుమార్ శ్యామ్, మాజీ.సర్పంచ్ బొంజుబాబు, శంకర్ నాయుడు, మత్స్య రాజు, శంకర్, కోటి పాల్గొన్నారు

# ప్రధాని విశాఖ షెడ్యూల్ ఖరారు

### 11న సాయంత్రం 7.30కి నగరానికి రాక
### తూర్పునౌకాదళం చోళాలో రాత్రి బస
### 12న ఎయులో సభ, పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన

**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో**

దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విశాఖ పర్యటన సోమవారం సాయంత్రం 5.30 గంటలకు ఖరారైంది. ఈ నెల 11న సాయంత్రం 5.30 గంటలకు మధురై ఎయిర్‌పోర్టు నుంచి విశాఖకు ఆయన చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో తూర్పు నౌకాదళంలోని ఐఎన్ఎస్ చోళాకు బయల్దేరుతారు. అక్కడే రాత్రికి బస చేస్తారు. అదే రోజు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ కూడా విచ్చేస్తున్నారు. వారు కూడా నౌకాదళంలోనే వేర్వేరుగా బస చేసే అవకాశాలున్నాయి. ఆ రోజు రాత్రికి దేశ ప్రధాని మోడీతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ భేటీ అవుతారని తెలుస్తోంది.

ప్రధాని సభకు సిద్ధమవుతున్న ఎయు ఇంజినీరింగ్ కళాశాల మైదానం

**షెడ్యూల్ ఇలా..**

11న సాయంత్రం 5.30 గంటలకు ప్రధాని మధురై ఎయిర్‌పోర్టులో బయల్దేరి విశాఖకు 7.30 గంటలకు రానున్నారు. తూర్పునౌకాదళంలోని చోళాకు అక్కడ నుంచి వెళతారు. 8 గంటల నుంచి అక్కడే నైట్‌హాల్ట్. 12న ఉదయం 10 గంటలకు తూర్పునౌకాదళం నుంచి నేరుగా ఎయు గ్రౌండ్స్‌కు 10.30 గంటలకు రోడ్డు మార్గంలో వస్తారు. 10.30 గంటల నుంచి 11.45 వరకూ పలు ప్రాజెక్టులకు ఫౌండేషన్ స్టోన్ వేయనున్నారు. 11.45 గంటలకు ఐఎన్ఎస్ చోళాకు బయల్దేరతారు. 12 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుని ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (ఐఎఫ్) విమానంలో బేగంపేట ఎయిర్‌పోర్టుకు 1.10 నిమిషాలకు చేరుతారు.

**పిఎం అజెండాలో లేని భోగాపురం ఎయిర్ పోర్టు**

12న ప్రధానమైన కార్యక్రమాల్లో ప్రధాని మోడీ పాల్గొంటారు. వాటిలో భోగాపురం ఎయిర్‌పోర్టు శంకుస్థాపన అంశం లేదు. ప్రధానమంత్రి కార్యాలయం ఈ అంశాన్ని తర్వాత అంటే మరలా విశాఖకు వచ్చిన సందర్భంలో చేపట్టాలని భావిస్తోంది. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ విషయంపై ఈ దఫా ఎలాంటి ప్రకటన చేస్తారన్నది మోడీ వైపు ఈ ప్రాంత ప్రజలు చూస్తున్నారు. బిజెపి నేతల నుంచి వెల్లడవుతున్న సమాచారం ప్రకారం.. స్టీల్‌ప్లాంట్‌పై మోడీ అంతిమంగా సానుకూలంగా ఉండొచ్చు అంటూ పలువురు తాజాగా వ్యాఖ్యానిస్తున్నారు. సెయిల్‌లో మెర్జింగ్ కార్యక్రమం ఉంటుందని, అయితే ఇంకోసారి విశాఖకు మోడీ వస్తారని, అప్పుడు భోగాపురం ఎయిర్‌పోర్టు, స్టీల్‌ప్లాంట్ అంశాలు అజెండాలో ఉంటాయని చెబుతున్నారు. ఎయు ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో భారీ ఎత్తున ప్రధాని సభకు ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వం, ఎయు యాజమాన్యం చేపడుతోంది. అక్కడ నుంచే సుమారు ఆరు ప్రాజెక్టులను వర్చ్యువల్‌గా ప్రధాని ప్రారంభించనున్నారు. హెచ్‌పిసిఎల్ రిఫైనరీ విస్తరణ కోసం జరిగిన పనులతో పూర్తయిన ప్రాజెక్టును ప్రధాని నరేంద్రమోడీ ప్రారంభించనున్నారు. ఆనందపురం మండలం గంభీరంలో పూర్తయిన ఐఐఎం భవనాన్ని ఇక్కడ నుంచే ప్రారంభిస్తారు. సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌కు శంకుస్థాపన కూడా వర్చ్యువల్‌గా చేపడతారు. స్టేషన్ డవలప్‌మెంట్ ప్రాజెక్టు పనులను కూడా మోడీ ప్రారంభించే అవకాశాలున్నాయి.

# నిర్బంధం తగదు : సిపిఎం

**ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ :** ప్రధాని నరేంద్ర మోడీ విశాఖపట్నం పర్యటన సందర్భంగా కార్మికులను, ప్రజలను భయపెట్టే విధంగా పోలీసులు ముందస్తు నోటీసులు పేరుతో 149 సిఆర్‌పిసి సెక్షన్ల కింద నోటీసులు ఇవ్వడాన్ని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఓ సంయుక్త ప్రకటనలో సోమవారం తీవ్రంగా ఖండించారు. ప్రధాని పర్యటన ఈ నెల 11, 12 తేదీల్లో ఉన్నందున విశాఖపట్నంలో ఎటువంటి నిరసనలూ చేపట్టరాదని, వినతిపత్రాలు ఇవ్వకూడదని పోలీసులు ముందస్తు నోటీసులు ఇస్తున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తున్న కార్మిక సంఘాల నాయకులకు, సాధారణ కార్మికులకు, రాజకీయ పార్టీల నాయకులకు, కార్యకర్తలకు ఈ నోటీసులు జారీ చేస్తున్నారని చెప్పారు. ప్రధాని పర్యటనకు ఆటంకంగా ఉంటే కఠినమైన చర్యలు తీసుకుంటామని బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. వాస్తవానికి విశాఖపట్నంతో పాటు తెలుగు ప్రజలు మొత్తం విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఉపసంహరించుకుంటున్నట్టు మోడీ విశాఖపట్నంలో ప్రకటించాలని కోరుకుంటున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్‌తో పాటు ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయొద్దని, ఆంధ్ర రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న హామీలను అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారని తెలిపారు. విశాఖపట్నం కేంద్రంగా వాల్తేరు డివిజన్‌తో కూడిన రైల్వేజోన్ ప్రకటించాలని, వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాలకు అభివద్ధి నిధులు మంజూరు చేయాలని, రాజధాని నిర్మాణానికి, పోలవరం నిర్మాణానికి అయ్యే ఖర్చులను పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే భరించాలని, విశాఖలోనూ, ఆంధ్ర రాష్ట్రంలోనూ ఏర్పాటు చేస్తానని చెప్పిన ఉన్నత విద్యాసంస్థలను వెంటనే ఏర్పాటు చేయాలని, తదితర డిమాండ్లను నరేంద్ర మోడీ దృష్టికి తీసుకువచ్చి విశాఖ బహిరంగ సభలో వీటన్నింటినీ అమలు చేస్తానని మోడీ ప్రకటిస్తారని వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రధానిని ఒత్తిడి చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్ర ప్రజల హక్కులను మోడీ ప్రభుత్వం దగ్గర తాకట్టు పెడుతోందని చెప్పారు. తాజాగా మోడీ విశాఖ వస్తున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం విశాఖలోని నాయకులను భయభ్రాంతులకు గురి చేయడం తగదన్నారు.

## 2.50 లక్షల పైచిలుకే

### - ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల నమోదు

**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో**

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల నమోదు భారీ స్థాయిలో జరిగింది. అక్టోబర్ 1 నుంచి నవంబర్ 7 వరకూ జరిగిన పట్టభద్రుల ఓట్ల నమోదుకు సోమవారం తుది గడువుకాగా 2.50 లక్షలకు పైచిలుకే నమోదైనట్లు కలెక్టరేట్ యంత్రాంగం వెల్లడించింది. రాత్రి 9.30 గంటల వరకూ ఈ లెక్క తేలనందున అంతకు ముందురోజు అంటే ఆదివారం నాటికే లక్షా 86 వేల మంది ఓటర్లుగా ఉత్తరాంధ్ర జిల్లాలు ఆరు చోట్ల నమోదు చేసుకోవడంతో చివరి రోజు సోమవారానికి 2.50 లక్షలకుపైగా ఆ సంఖ్య ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

## బాలారం పంచాయతీ సమస్యలపై వినతి

**ప్రజాశక్తి - కొయ్యూరు :** మండలంలోని బాలారం పంచాయతీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వైసీపీ నేత బంటు నాగేశ్వరరావు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మికి సోమవారం వినతిపత్రం అందజేశారు. పాత బాలారం, డి.మల్లవరం, బాలారం గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వెంటనే సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

## శివాలయానికి పోటెత్తిన భక్తులు

**ప్రజాశక్తి - సీలేరు :** జీకే వీధి మండలం సీలేరు శివాలయానికి రెండో కార్తీక సోమవారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి భక్తులు స్థానిక నదిలో స్నానాలు ఆచరించి అరటి తెప్పల్లో దీపాలు వెలిగించి నదిలో విడిచిపెట్టారు. అనంతరం స్థానిక శివాలయానికి చేరుకొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శివాలయంలో రావి, ఉసిరి, మారేడు, చెట్లకు మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక శివాలయంలో లక్ష దీపాల అలంకరణ సదరం మారి బాబు ఆధ్వర్యంలో యువకులు రూపకల్పన చేశారు. భక్తులు లక్ష దీపాలు వెలిగించి వారి భక్తిని చాటుకున్నారు.

## చెట్టు మాను తొలగింపునకు చర్యలు

**ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:** కిలగడ గ్రామ పంచాయతీ ఘాట్ మలుపు వద్ద వర్షాకాలంలో పడిపోయిన వృక్షం కొమ్మలు తొలగించిన అధికారులు దాని మానును తొలగించడం మరిచారన్న పత్రిక కథనాలను ఎంపీడీవో కిరణ్ కుమార్ స్పందించారు. ఈ మేరకు సోమవారం ఆర్అండ్‌బి డిప్యూటీ ఈఈకి ఫోన్‌లో తెలియజేశారు. వారం రోజుల్లో చెట్టు మొదలుని తొలగించేందుకు కాంట్రాక్టు టెండర్ వేస్తామని తెలియపరిచారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీవో విలేకరులతో మాట్లాడుతూ, మండల పరిధిలో పలు సమస్యలపై పత్రికల్లో వస్తున్న కథనాల పరిష్కారం కొరకు ఉన్నతాధికారులకు నివేదికలు అందజేస్తున్నామన్నారు.

## బట్టల దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం

**ప్రజాశక్తి - అనకాపల్లి :** అనకాపల్లి పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర థియేటర్ ఎదురుగా ఉన్న దొడ్డి అప్పారావు బ్రదర్స్ హోల్‌సేల్ బట్టల దుకాణంలో సోమవారం ఉదయం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో రూ.కోటీ 50 లక్షల విలువైన బట్టలు దగ్ధమయ్యాయి. తెల్లవారుజాము ఐదు గంటల సమయంలో ఈ బట్టల దుకాణం నుంచి పొగ రావడంతో కార్తీక మాస పూజలకు వెళ్తున్న భక్తులు గమనించి ప్రమాద విషయాన్ని అగ్నిమాపక శాఖ సిబ్బందికి తెలియజేశారు. దీంతో వారు హుటాహుటిన వాహనాలతో తరలివచ్చి మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే షాపులో ఉన్న మొత్తం బట్టలు దగ్ధమయ్యాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగినట్టు అగ్నిమాపక శాఖ సిబ్బంది తెలియజేశారు. మరో రెండు నెలల్లో సంక్రాంతి సీజన్ నేపథ్యంలో భారీగా బట్టల స్టాకును ఈ షాపులో తెచ్చిపెట్టారు. స్థానిక శాఖ వీధిలో ఉంటూ పది సంవత్సరాలుగా దొడ్డి అప్పారావు బ్రదర్స్ ఈ బట్టల దుకాణం నిర్వహిస్తున్నారు. స్థానిక మెయిన్ రోడ్డులో ఉన్న సౌత్ సెంట్రల్ షాపింగ్ మాల్ కూడా వీరిదే కావడం విశేషం. దుకాణానికి ఇన్సూరెన్స్ చేయకపోవడంతో భారీగానే నష్టం వాటిల్లినట్టు దుకాణ యజమాని అప్పారావు తెలిపారు. పండగ ముందు ఇంత పెద్ద నష్టం జరగడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

## జాతీయ చెస్ పోటీల్లో నైనాకు రజతం

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** హర్యానాలో జరిగిన జాతీయ అండర్-11 బాలికల చెస్ పోటీల్లో విశాఖకు చెందిన గొర్లి నైనా రజత పతకం సాధించింది. దేశ వ్యాప్తంగా 131 మంది పాల్గొన్న ఈ టోర్నీలో 66 మంది రేటెడ్, అన్‌రేటెడ్ క్రీడాకారులు పాల్గొన్నారు. 11 రౌండ్‌లలో ప్రత్యర్థులతో పోరాడి 8.5 పాయింట్లను సాధించి నైనా రజత పతకం కైవసం చేసుకుంది.